తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# రైతుకు సలహాలు ఇవ్వడానికే రైతు భరోసా కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రామచంద్రారెడ్డి

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంను మరింత లాభసాటి చేయాలని నిర్ణయించి క్షేత్ర స్థాయిలో రైతులకు సలహాలు, సూచనలు అందించడానికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామ చంద్రారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ మండలి సమావేశం ఛైర్మన్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 29 మండలాల్లో మామిడి ప్రధాన పంటగా వుందని, ఇప్పటికే ఉద్యానశాఖ అధికారులు రానున్న మామిడి సీజన్‌ను దృష్టిలో వుంచుకొని అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే సేంద్రీయ వ్యవ సాయం ద్వారా పండిస్తున్న పంటలకు ఇప్పటికే మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు రైతులు అధికారుల సూచనల మేరకు యాజమాన్య పద్దతులు పాటించి కోత దశలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రాగి పంట సాగుకు మరింత అవకాశం వుందని ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీని ఉపయోగించుకొనిఉత్పత్తులు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిఎంకె ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలపై మరింత అవగాహన కల్పించి పంట మార్పిడి జరిగేలా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ నానో ఎరువుల వినియోగంపై రైతులకు మరింత అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకొంటున్నా మన్నారు. శాంతిపురం మండలంలో ఎలాంటి ఎరువులు ఉపయోగించకుండా రాగి పంటను సాగు వేసి అధిక దిగుబడులు సాధించడం జరిగిందని, రాగి పంట సాగు చేసిన రైతుకు సర్టిఫికేట్ అందించామన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్ రెడ్డి, పశుసంవర్థకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, సభ్యులు గోవర్థన్‌బాబీ, జగదీద్వర్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఎడి పరమేశ్వర్, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది

-ఎన్నికల్లో గెలిచేందుకు విచ్చలవిడిగా దొంగ ఓట్లను చేర్చారు -రివర్స్‌గేర్‌లో రాష్ట్రాభివృద్ధి -నారా చంద్రబాబు నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు



చంద్రబాబుకి కత్తి బహుకరించిన నాయకులు

వెంకటగిరి, జనవరి 19 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి జగన్‌కు ఓటమిభయం పట్టుకుందని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎద్దేవా చేశారు. తిరుపతిజిల్లా వెంకటగిరిలో రా కదలిరా బహిరంగ సభలో చంద్రబాబునాయుడు పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలను బదిలీచేస్తున్నారన్నారు. 29 మంది దళితఎమ్మెల్యేలు ఉంటే వారి నియోజకవర్గాల్లో మాత్రమే ఇక్కడి వారు అక్కడికి అక్కడివారు ఇక్కడికి మారు స్తున్నారన్నారు. ఒక నియోజకవర్గంలో పనికి రాని వ్యక్తి మరో చోట ఎలాపనికి వస్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎటు చూసినా మాఫియా నడుస్తోందని విమర్శించారు. తాను ఉచితంగా ఇసుక ఇస్తే, ఇసుకనుండి తైలంపిండే తెలివితేటలు ఈ ముఖ్య మంత్రికి మాత్రమే వున్నాయన్నారు. ఎర్రచందనం సంపదను తాను కాపాడితే ఈ ప్రభుత్వంలో బహిరంగంగా స్మగ్లింగ్ చేస్తున్నారని విమర్శించారు. వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మైనింగ్ మాఫి యా ఎక్కువైందని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి వ్యవసాయం అంటే కూడా తెలియదని కోట్లాది రూపాయిలు సంపాదించడం తెలుసు అని తెలిపారు. జిల్లాను కొనే స్థాయికి ఆయన ఎదిగారని విమర్శించారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ ప్రసాదంలాగా నియోజకవర్గాన్ని తిన్నారని ఆరోపించారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యఇసుకదోపిడి చేసి కోట్లాది రూపాయిలు సంపాదించారన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి నియోజకవర్గాన్ని దోచుకుని తిన్నట్లు తెలిపారు. చివరకుగుడిని కూడా దోచుకుని తింటున్నట్లు విమర్శించారు. తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి వెంక టేశ్వర స్వామికి నామాలుపెడుతున్నారని ఆరోపించారు. మహిళా మంత్రి అవినీతి ఎక్కు వైందని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాను దోచుకు తింటున్నట్లు విమ ర్శించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఏ ఒక్క రంగమూ కూడా బాగాలేదని వాపోయారు. ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. మద్యపానం నిషేధాన్నిఅమలు చేస్తానని సొంత మద్యం తయారుచేసి విక్రయిస్తున్నా రన్నారు. నాసిరకం మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిని ప్రాణాలు కూడా పోతున్నట్లు తెలిపారు. మాట తప్పని మడమ తిప్పని నాయకుడిగా చెప్పుకుంటున్న ఆయన ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చారని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్యకేసులో గొడ్డలి గాట్లు ఎక్కడవని పోలీసులు ప్రశ్నిస్తే సొంత పత్రికలో నారావారి రక్త చరిత్ర అని అబద్ధాల రాతలు సృష్టించినట్లు తెలిపారు. శిశుపాలుడిలా 100తప్పులు జగన్ ఎప్పుడో దాటేశారన్నారు. ఎన్టీ రామారావు హయాంలోనే మంత్రిగా పనిచేసిన సీనియర్ నేత ఆనం రామనారాయణ రెడ్డిని సిఎంజగన్మోహన్‌రెడ్డి అవమాన పరచడం బాధాకరమన్నారు. సీనియర్ అని కూడా లెక్కచేయకుండా అహంకారంగా ప్రవర్తించినట్లు తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు అడిగితే సిఎం ఇవ్వలేదన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే పక్కనపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో మాఫి యా ఎక్కువగా ఉందని తాను రెండున్నర సంవత్సరాల క్రితం చెప్పానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీకేంద్రమంత్రి పనబాక లక్ష్మి,మాజీ మంత్రులు సోమిరెడ్డి చందనమోహన్ రెడ్డి, పరసారత్నం, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సుగుణమ్మ, రామారావు, సునీల్ కుమార్, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జన్నిరమణయ్య, జి.నాగేశ్వరరావు, మస్తాన్ యాదవ్, మాజీ ఏఎంసి చైర్మన్లు సిసి నాయుడు, రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఓట్లుకు సహకరించిన అధికారులపై చర్యలు ఎక్కడ!

- కలెక్టరేట్ ఎదుట తెలుగుదేశం ఆధ్వర్యంలో ధర్నా




కలెక్టరేట్ ఎదుట దొంగ ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని డిమాండ్ ధర్నా

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త: ఓటర్ల జాబితాలో ఓట్లను తొలగించి, దొంగ ఓట్ల నమోదుకు సహ రించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్, జిడి నెల్లూరు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులులు మాట్లాడుతూ ఎన్నికల ఓటర్ల జాబితాలోని తప్పులు, అవకతవకలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రతి బూత్‌లో మృతి చెందిన వారి ఓట్ల వివరాలు, నివాసిత ప్రాంతంలో లేని వారి వివరాలు, బోగస్ ఓటర్ల వివరాలను బిఎల్‌ఓల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ వీటిపై ఎలాంటి చర్యలు తీసు కోకుండా 90 శాతం వరకు తిరిగి ఓటర్ల ముసాయిదా జాబితాలో అలాగే వున్నాయని ధ్వజమెత్తారు. అలాగే తప్పుడు సమాచారంతో ఫాం-6లతో ఓటరు నమోదుకు అధికార పార్టీ నాయకుల నుండి వేల సంఖ్యలో దరఖాస్తులు అధికారులకు అందాయని, తెలుగుదేశం, ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లను తొలగించడానికి అధికార పార్టీ నాయకుల అండతో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు తప్పుడు వివరాలతో ఫారం-7 దాఖలు చేశారని వారు ధ్వజమెత్తారు. వీటిపై తాము పలుమార్లు ఫిర్యాదు చేసిన దొంగ ఓట్లను తొలగించినట్లు తమకు ఎలాంటి సమాచారం ఇప్పటి వరకు అందలేదన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకొని మృతి చెందిన వారి ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కఠారి హేమలత, తెలుగుదేశం నాయకులు చంద్రప్రకాష్, రాష్ట్ర దేశం నాయకులు వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా దేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, దేశం నాయకులు కాజూరు బాలాజీ, సిఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# వరప్రసాదరావు దారెటు..?

- మొండిచేయి చూపిన అధిష్టానం - జనసేన వైపు ఎమ్మెల్యే చూపు, తిరుపతి ఎంపి అభ్యర్థిగా యత్నం

గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త : గూడూరు వైసీపీలో సంక్షోభం తలెత్తే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటేకరవమంటే కప్పకు కోపం,విడవమంటే పాముకు కోపం అన్న ట్లుగా మారిపోయింది ఆ పార్టీ పరిస్థితి. ఇటు చూస్తే పార్టీపై ప్రజల్లో పీకల దాకా అసంతృప్తి కనిపిస్తోంది. ఎక్కడికక్కడ అభ్యర్థులను మార్చేసి ఎంతో కొంతమేర ప్రజలను మాయ చేయాలని చూస్తున్నారన్న చర్చనడుస్తోంది. రాష్ట్రం లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175కు175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వినూత్నంగారాజకీయ వ్యూహాలుచేపడుతున్నారు. ఆ క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలను మార్పులు చేర్పులు చేస్తున్నారు. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు సీట్లు దక్కకపోవడంతో ఆయా ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి అనుచర గణాలు పార్టీనిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేయడం, కొంత మంది పార్టీని వీడుతున్న ఘటనలు కనిపిస్తున్నాయి. అయితే అందుకు భిన్నంగా గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావుని కాదని ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్‌ను గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా అధిష్టానం ప్రకటించింది. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావుకు ముఖ్యఅనుచరులుగా చెప్పుకుంటున్న నాయకులు, ప్రజాప్ర తినిధులు సైతం స్పందించకపోవడం విశేషం. ఆపరేషన్ ఆకర్ష్ 2014లో చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ రూ.100 కోట్లు తాయిలాలు ప్రకటించినా వాటన్నింటిని తిప్పికొట్టి వైసీపీకి విధేయత చూపారు. వరప్రసాదరావు తిరుపతిఎంపీఅభ్యర్థిగా, గూడూరు ఎమ్మెల్యేగా అండదండల తో గెలిచి ప్రజలకు అనేక అభివృద్ధి పనులు చేసి పెట్టి అభివృద్ధి ప్రదాతగా కీర్తించబడ్డారు. ముఖ్యంగా గూడూరు పట్టణంలో అర్థాంతరంగా నిలిచిపోయిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించేందుకు రాష్ట్రమంత్రులను అనేకసార్లు కలిసి నిధులు తెప్పించడంలో సఫలీకృతులయ్యారు. అలాగే గూడూరు పట్టణంలో సుమారు 175 కోట్లతో కూరగాయల మార్కెట్, రైతు బజారు, ఇంకా అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గూడూరు నియోజకవర్గంలోని నాయకుల ఆదరణ కరువు కావడం, ఏ ఒక్క నాయకుడు కూడా గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మళ్లీ వరప్రసాదరావును ప్రకటించాలని చెప్పకపోవడంతో ఎమ్మెల్యేతో వారికి ఉన్న సంబంధాలు ఎలా ఉన్నాయో తేటతెల్లం అవుతుంది. భవిష్యత్ నిర్ణయం ప్రకటించే క్రమంలోజనసేన అభ్యర్థిగా తిరుపతి ఎంపీగా పోటీ చేసేందుకు జనసేననాయకులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. తిరుపతి పార్లమెంటు అభ్యర్థిగా ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసి పవన్‌కల్యాణ్, చిరంజీవిలతోమంచి రాజకీయ పరిచయాలుకూడా వరప్రసాదరావుకు ఉన్నాయి. తిరుపతి ఎంపీగా ఐదేళ్లుగా అన్ని నియోజకవర్గాల నాయకులతో సత్సంబంధాలు, గూడూరు ఎమ్మెల్యేగా వైసీపీ నాయకులతో ఉన్న అనుబంధం జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తే తనకు లాభిస్తుందని వరప్రసాద్ భావించే అవకాశం ఉంది.వరప్రసాదరావు నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ భవిష్యత్ నిర్ణయం ప్రకటించేందుకు ఆయన అనుచరగణంతో అంతర్గతంగా చర్చిస్తున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ జెండాలకు మళ్ళీ జోష్



శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీలో మళ్ళీ జోష్ వచ్చింది. కర్నాటక, తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం అలాగే ఆంధ్ర రాష్ట్రంలో పార్టీకి జవసత్వాలు కల్పించటానికి పార్టీ అధి ష్టానం చొరవ తీసుకుంటుందిఈ నేపథ్యం లో పార్టీ రాష్ట్ర పగ్గాలను వైయస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైయస్ షర్మిలకు అప్పగించారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యతను పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ షర్మిలకు అందించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ తిరుపతిపార్లమెంటు నియోజకవర్గంలో పార్టీని ప్రజల వద్దకు తీసుకెళ్ళి ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీయే దిక్కు అన్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని నాలుగుమాడావీధుల్లో డాక్టర్ చింతామోహన్ పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి పార్టీ రూపొందించిన వివిధ వర్గాలను ఆకట్టుకునే కరపత్రాలు 'మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో రూపొందించినవి పంపిణీ చేసారు. ఇంటింటికి వ్యాపార సంస్థలకు వెళ్ళి దండం పెడుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతున్నారు.

## 25న రామకృష్ణతీర్థ ముక్కోటికి సకల ఏర్పాట్లు

-భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు -జెఈఓ వీరబ్రహ్మం

తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలోని ముఖ్యమైన తీర్థాలలో రామకృష్ణతీర్థ ముక్కోటి వేడుకలు 25వతేదీ గురువారం జరగనుంది. ఈ వేడుకలకు హాజరయ్యేభక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని, అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లుచేయలని టిటిడి జెఈఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. యాత్రికుల కోసం షామియానా, డిస్‌ప్లే బోర్డులు, భద్రత సిబ్బంది సమన్వయంతో వ్యవహరించడం, వృద్ధులను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని అనుమతించరాదని తెలిపారు. పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసి బస్సులు సిద్ధం చేయాలన్నారు.ఈ సమీక్షలో ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, విజిఓ గిరిధర్‌రావు, డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాసులు, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, 2టౌన్ సిఐ సత్యనారాయణ, ఆలయ పేష్కార్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణులకు హాని తలపెడితే...
# చట్ట పరమైన చర్యలు : జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 19, ప్రభాతవార్త : అటవీ, వన్య ప్రాణుల రక్షణ మన అందరి బాధ్యత అని, వాటికి హాని తలపెడితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల సమన్వయంతో అటవీ, వన్య ప్రాణుల రక్షణ సుసాధ్యం అని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా అటవీ, వన్య ప్రాణుల రక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఛైర్మన్ హోదాలో అటవీ శాఖ, రెవెన్యూ పోలీస్ తదితర సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండా మేరకు అంశాలపై కమిటీకి డిఎఫ్ఓ సతీష్ రెడ్డి వివరిస్తూ ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు, భూ హద్దులు సమస్యలు ఉన్నాయని తెలుపగా, సమస్య పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం, అటవీ శాఖ సమన్వయంతో సంయుక్తంగా తనిఖీ చేసి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే పాకాల, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయని తెలుపగా వాటిని ట్రాకర్స్ ద్వారా పర్యవేక్షిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. అలిపిరి కాలి నడక దారిలో గత ఆగస్టు నెలలో జరిగిన దుర్ఘటన నాటి నుండి ఆరు చిరుత పులులను పట్టుకున్నామని, టిటిడి సహకారంతో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారి సూచనల మేరకు టిటిడి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని పోలీస్, ఎస్టిఎఫ్ అధికారుల సహకారంతో అటవీ శాఖ అధికారులు ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పులికాట్ సంరక్షణకు సంబంధించి శాఖలు అన్ని విధాల చర్యలుచేపట్టాలని, అటవీ చట్ట విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే నిబంధనలు మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెంచల్ కిషోర్, అదనపు ఎస్పి విమల కుమారి, డిఎఫ్ఓ, వైల్డ్ లైఫ్ సూళ్లూరుపేట శామ్యూల్, ఫ్లయింగ్ స్క్వాడ్ శివకుమార్, సబ్ డిఎఫ్ఓ, శ్రీనివాస్, పోలీస్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రూ.3 వేల కోట్ల వ్యాపార లక్ష్యం

- బ్యాంకులో విధులు నిర్వర్తించే వారి సర్వీసు రెగ్యులైజేషన్
- డిసిసిబి మహాజన సభలో ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి




డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి అధ్యక్షత జరిగిన డిసిసిబి మహాజన సభ

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త: 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3 వేల కోట్ల రూపాయల వ్యాపారం లక్ష్యంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నిర్ధేశించుకొని ముందడుగు వేస్తోందని డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మకృష్ణమూర్తి అన్నారు. డిసిసిబి కార్యాలయంలో శుక్రవారం డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి అధ్యక్షతన బ్యాంకు మహాజనసభ జరిగింది. ఈ సమావేశంలో డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వెయ్యి కోట్ల రూపాయల మేరకు డిపాజిట్లు సేకరణ లక్ష్యంగా నిర్ధేశించుకొందని, అలాగే 2 వేల కోట్ల రూపాయల రుణ పంపిణీ లక్ష్యంగా నిర్ధేశించుకొని ముందుకు వెళ్తుందన్నారు. అలాగే డిసిసిబి బ్యాంకు బ్రాంచీలు, సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన స్వల్ప, దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాలు వాయిదా మీరిన రుణాలు చెల్లించిన వారికి వడ్డీ రాయితీ, వడ్డీపై వడ్డీ, అపరాధపు వడ్డీ మాఫీను మార్చి 31వ తేదీ వరకు పొడగించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ అవకాశంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఛైర్‌పర్సన్ కోరారు. అలాగే బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సర్వీస్ రెగ్యులేషన్ చేయాలని మహాజన సభ తీర్మానించింది. అలాగే ప్రాథమిక సహకార సంఘాల్లో పని చేస్తున్న వారికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని మహాజన సభ తీర్మానించింది. అలాగే సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడానికి వాటికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి బ్రహ్మానందరెడ్డి, డిసిసిబి సిఇఓ మనోహర్‌గౌడు, సహకార సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు, పరిశుభ్రతే...
# ఆరోగ్యకరమైన ప్రధానాంశాలు

-పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి



తిరుపతిరూరల్, జనవరి 19 ప్రభాతవార్త: హెల్తీ విలేజ్‌లో త్రాగునీరు, పరిశుభ్రతే ప్రధానాంశాలని, వీటిపై పంచాయతీ రాజ్, గ్రామ సర్పంచ్‌లు దృష్టి పెట్టాలని పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరుగుతన్న హెల్తీ విలేజ్ జాతీయ వర్క్‌షాపు రెండోవరోజున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ సేవల అంశాలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ వివరించారు.గ్రామాలలో తాగునీరు, పరిసరాల పరిశుభ్రత ప్రధానాంశాలని, వాటిని అధిగమించా లన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరుఅందిస్తున్నామని, గ్రామ పంచా యతీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పరిశుభ్రత గురించి వివరిస్తూ ఇప్పటికే ప్రతి ఇంటికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మించుకుని, ఓడిఎఫ్+లోకి వెళ్ళామని తెలిపారు. త్రాగునీటి విషయంలో కూడా శ్రద్ధ వహిస్తే నీటి సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలు తెలెత్తవన్నారు. గ్రామ పంచాయతీలలో మురుగు కాల్వల నిర్మాణం వల్ల నిర్వాహణ పంచాయతీలకు భారంగా మారుతుందని, గ్రామ సర్పంచ్‌లు దృష్టిపెట్టి భూగర్భ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన సచివాలయ వ్యవస్థ ఏర్పాటు జరిగిందని, 2వేలమందిజనాభాకుఒక సచివాలయం అందుబాటులోకి తెచ్చా మని, సంక్షేమ పథకాలు సచివాలయ స్థాయిలో అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేయడంతో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కోవిడ్ సమయంలో వాలంటీర్ సేవలు చాలా ఉపయోగపడ్డాయన్నారు. వైయస్సార్ విలేజ్ క్లినిక్స్ సచివాలయ స్థాయిలో ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రజలకు రవాణా ఆర్థిక భారం తగ్గేలా వైద్య సేవలు అందించటానికి 24 గంటల పాటుఅందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు విలేజ్‌స్థాయిలో అసంక్రమిత వ్యాధులను గుర్తించటానికి 14రకాలవైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్, రూరల్ డెవలప్మెంట్ సూర్యకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ఏర్పాటుతో 1.4 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, గ్రామస్థాయిలోనే సిటిజన్ సర్వీసులులతో పాటు 88రకాల ప్రభుత్వ సేవలు ప్రస్తుతం అందిస్తున్నామని తెలిపారు. గ్రామాలలో పరిశుభ్రత, త్రాగునీరు సౌకర్యం వెస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వాహణ చేపట్టి పంచాయతీలకు ఆదాయంతెచ్చేలా చేస్తున్నామని తెలిపారు. సచివాలయ వ్యవస్థలో పంచాయతీ సెక్రటరీ డిజిటల్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, వెటర్నరీ, ఫిషనరీస్ అసిస్టెంట్, రెవెన్యూ సెక్రటరీ పోస్టులను నియమించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ గ్రామాలలో హెల్త్ క్లినిక్స్ ఏర్పాటుతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, టెలీ మెడిసిన్ సౌకర్యం కల్పించి, దేశంలోనే టెలీకాన్ఫరేన్స్‌లో మెదటిస్థానంలో ఉన్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేసి, ప్రతి సచివాలయ పరిధిలో ప్రతి నెలకు రెండుసార్లు 104 వాహనం పర్యటించి వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. బెడ్ రీడన్‌కు కూడా వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరంచారు. గత 9నెలల్లో 50సార్లు ఫీవర్ సర్వే నిర్వహించామని, గుర్తించిన జబ్బులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ప్రాధాన్యత ఇచ్చి, పంచాయతీరాజ్ వ్యవస్థ, హెల్తీవిలేజ్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కార్యక్రమాలు నిర్వహించి నట్లు తెలిపారు. గ్రామాలలో పొదుపు సంఘాలు రూ.10వేలతో ప్రారంభమై రూ. 20లక్షల రుపాయాల వరకు ఋణం పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ కార్యధర్శి సునీల్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థకు ప్రభుత్వాలు ప్రధాన పాత్ర పోషించే విధంగా అవకాశం ఇస్తే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అభివృద్ధి ముందు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ సెక్రటరీ వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ సిఎస్ కుమార్, జడ్పి సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిపిఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆదర్శనీయుడు

బంగారుపాళ్యం, జనవరి 19 ప్రభాతవార్త: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదర్శ నీయ వ్యక్తి అని రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా అన్నారు. శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతి అని అందుకు నిదర్శనం అంబేద్కర్ 126 అడుగుల విగ్రహంను ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి!

**బంగారుపాళ్యం, జనవరి 19 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బైరెడ్డిపల్లి మండలం చింతలగుట్ట గ్రామంకు చెందిన శివ(18), అక్రమ్(22)లు ద్విచక్రవాహనంలో బంగారుపాళ్యంకు వచ్చారు. బంగారుపాళ్యంలో కాంక్రీట్ కమ్మీ పనులు ముగించుకొని తిరిగా ద్విచక్ర వాహనంలో గ్రామంకు వెళ్తుండగా మొగిలి వద్ద ఈచర్ వాహనం డీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ, అక్రమ్‌లను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శివ మృతి చెందాడు. ఈ మేరకు ఎఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబును కలసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవి



**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:** పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవి శుక్రవారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబునాయుడును విజయ వాడలో కలిశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవి పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. ఇప్ప టికే పూతలపట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీని నియమించడంతో మరోసారి తన అభ్యర్థనను పరిశీలించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవి పార్టీ అధినేతను కోరారు. మరోవైపు పార్టీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవిని చిత్తూరు పార్లమెంటు స్థానం నుండి పోటీ చేయిం చడానికి ప్రయత్నిస్తోందని, ఈ విషయంపై త్వరలో నిర్ణయం వెలువడుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

## రాజ్యాంగ రచనలో మరవలేని అంబేద్కర్ కృషి

– కలెక్టర్ సగిలి షన్మోహన్

**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:** దేశానికి రాజ్యాంగం రచించడంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పందన హాలులో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎంకె ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ, బిసీ సంక్షేమ శాఖ డిడి రబ్బానీ భాషా, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం నియోజకవర్గంలో జయహో బిసి సభలు

**కుప్పం, జనవరి 19 ప్రభాతవార్త :** తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో జయహో బిసి సభలను ఆ పార్టీ బిసి విభాగం నేతల అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈనెల 21న కుప్పం మున్సిపాలిటీ, 23న రామకుప్పం, 24న శాంతిపురం, 25న కుప్పం మండలం కొత్తపల్లి, 26న గుడుపల్లె మండలంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బిసిల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## గ్రానైట్స్ అధినేత ప్రభు మృతి.. దేశం నేతల సంతాపం

**కుప్పంరూరల్, జనవరి 19 ప్రభాతవార్త :** కుప్పం మున్సిపల్ పరిధి లక్ష్మీపురంకు చెందిన గంగోత్రి గ్రానైట్స్ అధినేత ప్రభు మృతి చెందారు. గుండెపోటు రావడంతో ఈయన మృతి చెందారు. ఇతని మృతి పట్ల కుప్పం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, నేతలు రాజ్‌కుమార్, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కన్నన్, మంజునాథ్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, ఆర్‌ఆర్ రవి, సతీష్, నరేష్ తదితరులు సంతాపం తెలిపారు.

## ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతులు పంపిణీ



**రామకుప్పం, జనవరి 19 ప్రభాతవార్త :** స్థానిక అంబేద్కర్ గురుకులంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో గెలిచిన విజేతలకు అధికారులు, నేతలు బహుమతులు అందించారు. క్రికెట్‌లో కెంచ నబళ్ల జట్టు, కబడ్డీలో ఐపగానిపల్లి, వాలీబాల్‌లో మణీంద్రం జట్టు, బాడ్మింటన్‌లో రామకుప్పం జట్టు, ఐపగానిపల్లి ఖోఖో విభాగాల్లో విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, మండల కన్వీనర్ బాబురెడ్డి, నేతలు మురుగేష్, కేశవరెడ్డి, ఎంపిడిఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన నెమలి అప్పగింత

కాణిపాకం, జనవరి 19 ప్రభాతవార్త:



ప్రమాదంలో గాయపడిన నెమలిని భక్తులు కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినఘటన కాణిపాకంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి. తవణంపల్లెమండలం ఈచనేరి అటవీప్రాంతంగుండావెళ్ళే రోడ్డుపై తీవ్రంగా గాయపడిన నెమలి కనబడడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం వస్తున్న భక్తులు గమనించి నెమలిని తీసుకువచ్చి కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీస్ స్టేషన్ల ఏఎస్పై సుజాత ఆధ్వర్యంలో పోలీసులు గాయపడిన నెమలికి సపర్యలు చేసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి అప్పగించారు. పోలీసు స్టేషన్ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## అన్నదాన శిబిరానికి విశేష స్పందన

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 19 ప్రభాతవార్త :



బోయకొండగంగమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం నిర్వహించిన అన్నదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి శుక్రవారం అమ్మవారి రాహుకాలా భిషేకానికి తరలి వచ్చే భక్తులకు దేవస్థానం వారు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాత కళ్యాణకట్టవద్ద వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళిలతోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు రాజేష్, భారతి, భాస్కర్‌రెడ్డిలు అమ్మవారి భక్తులకు అన్నదాన శిబిరంలో భోజనం వడ్డించారు. పలమనేరుకు చెందిన సిఎస్.నవీన్‌కుమార్ అతని మిత్రబృందం కూరగాయలను విరాళంగా అందించారు.

## క్యాలండర్లు ఆవిష్కరణ

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 19 ప్రభాతవార్త :



శక్తిక్షేత్రం బోయకొండపై అమ్మవారి క్యాలండర్లను ఆవిష్కరించారు. జిల్లా ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈఓ చంద్రమౌళి గంగమ్మ ప్రతిమతో కూడిన క్యాలండర్లను ఆవిష్కరించారు. ఏటా ప్రింటింగ్‌ప్రెస్‌చే అమ్మవారికి క్యాలండర్లు అందించడం రివాజు. ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు రాయల్ మోహన్, రామ్‌కుమార్‌రెడ్డి, సిద్ధారెడ్డి, సురేంద్రరెడ్డి, నాగరాజు చౌదరి, శ్రీనివాసులురెడ్డి, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో నాంపల్లె హైస్కూల్ హెచ్‌ఎం మృతి!

ఐరాల, జనవరి 19 ప్రభాతవార్త:

మండలంలోని నాంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భాష్యం హరి శుక్రవారం గుండెపోటుతోమృతి చెందారు. పూతలపట్టు మండ లం పోటుకనుమ గ్రామ పంచాయతీ చిగరపల్లెమిట్టకు చెందిన భాష్యం హరి నాంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా గుండె పోటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు హరిని చికిత్సనిమిత్తం పి.కొత్తకోట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హెచ్‌ఎం హరి ఆకస్మిక మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## కులగణన సర్వే ప్రారంభం

బంగారుపాళ్యం, జనవరి 19 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే శుక్రవారం మండల పరిధిలో తెల్లవారుజాము నుండి ప్రారంభమైంది. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఈ సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి వ్యక్తిగతంగా కుల గణన నిర్వహించారు. మొదటి రోజు శుక్రవారం 2,730 మందికి కుల గణన చేయగా, 576 గృహాల్లో ఈ సర్వే పూర్తి చేసినట్లు ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఆరుగురు సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. బంగారుపాళ్యం నందు సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి ఇంటిలో అధికారులు కుల గణన ప్రారంభించారు.

## చీకూరుపల్లిలో ఆరోగ్య సురక్ష క్యాంపు

**బంగారుపాళ్యం, జనవరి 19 ప్రభాతవార్త:** మండలంలోని చీకూరుపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఆరోగ్య సురక్ష క్యాంపును అధికారులు నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంను జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్, ఇతర సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ముగ్గుల విజేతలకు తమన్నాచే బహుమతులు

పుంగనూరు, జనవరి 19 ప్రభాతవార్త:



బిసివైపార్టీ నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలైన మహిళలకు సినీనటి తమన్న శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. పార్టీనేత రామ చంద్రయాదవ్‌ఇంటిఆవరణలోనిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అతిథి గా పాల్గొన్న ఆమె చేతులమీదుగా లక్కి డ్రా విజేతలను ఎంపికచేశారు. విజేత లకు తమన్నాతోపాటు సింగర్ సునీత, యాంకర్ సుమ కూడా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ఎద్దుల, కబడ్డీపోటీలను కూడా త్వరలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

## మితిమీరిన కోరికలతోనే కష్టాలు

చిత్తూరురూరల్, జనవరి 19 ప్రభాతవార్త:



అన్ని జన్మలలో ఉత్తమమైన జన్మమానవ జన్మఅని, వృక్ష, జంతు జన్మలు ప్రకృతి నియమనిబంధనలకు అనుగుణంగా వున్నాయనీ, ఒక్క మానవ జన్మ మాత్రమే విరుద్ధంగా ప్రవర్తిస్తూ కష్టాలను కొనితెచ్చుకొంటున్నారని సీనియర్ పిరమిడ్ మాస్టర్ తటపర్తి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కాణిపాకం సమీపంలోని సిద్దంపల్లి వద్ద వున్న శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా క్షేత్రంలో ప్రారంభమైన ధ్యాన మహా యజ్ఞంలో ఆమె ముఖ్య వక్తగాపాల్గొనిప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిఘ్నే శ్వరపిరమిడ్ మహాశక్తి క్షేత్రం నిర్వాహకులు డా.బి.గోపాలక్రిష్ణ, కన్వీనర్ రాధిక గోపాలక్రిష్ణ, ధ్యానులు పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

కాణిపాకం, జనవరి 19 ప్రభాతవార్త:



కర్ణాటక హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి.వరాలే కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించు కున్నారు. ఆయనకు ఆలయఅర్చకులు ఏఈఓ హరిమాధవరెడ్డి, ఆలయ మర్యా దలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. వారికి వేదమంపడపం లో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంల లో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట చిత్తూరు జిల్లా జడ్జి భీమా రావు, చిత్తూరురూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ఆలయ సూపరెండెంట్ కోదండ పాణి, ఐరాల తహశీల్దార్ సుశీల, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో యాంకర్ సుమ, గాయని సునీత

కాణిపాకం, జనవరి 19 ప్రభాతవార్త:



ప్రముఖ బుల్లితెరయాంకర్ సుమకనకాల, ప్రముఖ గాయని సునీతలు శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ధనుంజయ, సూపరెండెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి దర్శనఏర్పాట్లు చేశారు. అనంత రం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయన వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసిస్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజే శారు.

## రేపు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**కుప్పం, జనవరి 19 ప్రభాతవార్త :** సాయిమాతా సేవా ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిచే ఈనెల 21న కుప్పం బాలుర హైస్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. కంటి జబ్బులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9391833999నెంబరును సం ప్రదించాలని కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహణ



– ఆల్ఫా స్కూలు తీరుపై విద్యార్థి సంఘాల మండిపాటు

చిట్టమూరు, జనవరి 19 ప్రభాతవార్త

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చిట్టమూరులోని ఆల్ఫా ప్రైవేటు స్కూలు యాజమాన్యం ప్రవర్తిస్తున్న తీరుపట్లవిద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు భగ్గు మంటున్నాయి. ప్రభుత్వం ఈ నెల 21వరకు సెలవులు పొడిగించినప్పటికీ ఇవేమీ తమకుపట్టవన్నట్లు ఆల్ఫాస్కూలు యాజమాన్యం యథేచ్ఛగా తరగ తులు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తు న్నారు. ఆల్ఫా స్కూలు యాజమాన్యం తీరుపై ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శేషయ్య జిల్లా, మండల విద్యాశాఖలకు తెలియజేసి వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**ఎంఇఓ వివరణ**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆల్ఫా స్కూలు విషయంపై మండల విద్యాశాఖఅధికారి ప్రసాద్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా శుక్రవారం ఆల్ఫా స్కూలులో తరగతులు నిర్వహించడం వాస్తవమే అని, మధ్యాహ్నం వరకు నిర్వహించి తదుపరి పాఠశాలను మూసివేస్తామని సిబ్బంది చెప్పారని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## చిట్టమూరు లో కులగణన



చిట్టమూరు, జనవరి 19 ప్రభాతవార్త :

చిట్టమూరు మండలంలో ఎంపిడిఓ షాలెట్ సూచనలు, సహకారంతో వేగంగా కులగణన జరుగుతోంది.పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో కులగణన కార్యక్రమం ఆయా గ్రామాల్లో చేపడుతున్నారు. ఇదిలావుంటే కులగణనలో వ్యవసాయశాఖ సిబ్బందిని నియమించ డంతో వారు ఇప్పుడే పంట నమోదులో తలమునకలై జిల్లా అధికారులు డెడ్‌లైన్లు విధిస్తుండటంతో వారికి ఇటు కులగణన, అటు ఈ-క్రాప్ నమోదు భారంగా మారిందని పలువురు వాపోతున్నారు.

## సామాజిక సమతా సంకల్ప సభకు భారీగా వైసీపీ శ్రేణులు

గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త :



విజయవాడలోశుక్రవారంజరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గూడూరు నుంచి భారీ ఎత్తున వైసీపీ శ్రేణులు, అభిమానులు భారీఎత్తున తరలి వెళ్లారు. ఎంఎల్‌సి మేరిగ మురళీధర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకాదేవసేనమ్మ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో వైసీపీనాయకులుయల్లసిరిగోపాల్‌రెడ్డి, వైసీపీసీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బల్లి కల్యాణ్‌తో ఆర్డీఓకిరణ్ భేటీ



గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త

నెల్లూరులోని ఎంఎల్‌సీ బల్లి కల్యాణ్ చక్రవర్తిని ఆయన నివాసంలో శుక్రవారం గూడూరు ఆర్డీఓ మీసాల కిరణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ కలయికలో ఎలాంటి రాజకీయ ప్రాధాననయత లేదని, మర్యాదపూర్వకంగానే కలిసినట్లు గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పలువురు రచయితలు రచించిన విలువైన పుస్తకాలను కల్యాణ్ చక్రవర్తికి అందజేసినట్లు తెలిపారు. అయితే ఈ ఇద్దరి భేటీతో రాజకీయ మలుపులు ఏమైనా ఉండొచ్చేమోనని, కొన్ని రాజకీయ మార్పులు రావచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి

కోట, జనవరి 19 ప్రభాతవార్త

జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం రెండోదశను ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని ఎంపిడిఓ మారెళ్ల భవాని కోరారు. కోట మండలం గూడలి గ్రామంలో శుక్రవారం జగనన్నఆరోగ్య సురక్ష రెండోదశ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులతో పాటు ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్పిటిసి దాసరి కోటయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం ఖాయం

కోట, జనవరి 19 ప్రభాతవార్త



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని ఉమ్మడి నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దిన్ అన్నారు. శుక్రవారం ఆయన కోటలో విలేకరులతోమాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తెగా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ బాధ్యతలు చేపట్టేఅన్ని అర్హతలు వైఎస్ షర్మిలకు ఉన్నాయ న్నారు. ఆమె నాయకత్వంలోకాంగ్రెస్‌లో చేరికలు పెరుగుతాయన్నారు. ఇప్ప టికే జగన్‌మోహన్‌రెడ్డితో ఉన్న అసలైన కాంగ్రెస్ వాదులు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. పూర్వవైభవం తీసుకొచ్చేందుకు షర్మిల నాయకత్వంలో పనిచేసేందుకు వారంతా తిరిగి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## మరో ఆరు నెలలు సొసైటీల త్రిసభ్య కమిటీ పాలన పొడిగింపు

కోట, జనవరి 19 ప్రభాతవార్త

రైతుల భాగస్వామ్యంతో పనిచేయాల్సిన సహకార సంఘాలు వైసీపీ అధికా రంలోకి వచ్చాక కమిటీలతో నడుస్తున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా త్రిస భ్య కమిటీల ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు జరిగేలా వాటి కాలపరిమితిని మరో ఆరునెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 88 సొసైటీలు ఉన్నాయి. ఈ సొసైటీల త్రిసభ్య కమిటీల పదవీ కాలం ముగిసింది. రాజకీయాలకు అతీతంగా సహకార సంఘాలు పని చేయాల్సి ఉండగా, మితిమీరిన రాజకీయ జోక్యంతో అన్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీకి చెందిన రైతులు ఇప్పటికే అనేకమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో పాలకవర్గం లేకపోతే సహకార సంఘాలు బలహీనమయ్యే పరిస్థితి ఉందని రిజర్వు బ్యాంక్, నాబార్డు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలుగుదేశం పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

## సిద్ధవరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కోట, జనవరి 19 ప్రభాతవార్త

కోటమండలంకర్లపూడి, సిద్ధవరం గ్రామాల్లోశుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. సంక్షేమ పథకాలను పవర్‌ప్రజంటేషన్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రామరాజ్యం సాధించుకుందాం

– సత్యవరప్రసాద్‌నాయుడు



ఓజిలి, జనవరి 19 ప్రభాతవార్త

బలహీన వర్గాల అణచివేత, పేదలరు ఇంకా పేదలు గా మారుస్తున్న పాలన, సమాజంలో ఏ ఒక్కరికీ దక్కని భద్రతతో తెలుగు నేల అల్లాడుతున్న ఈ వేళ.. రామరాజ్య స్థాపనకు మనమందరం కదలాలని ఓజిలి యువనాయకుడు కంకణాల సత్యవరప్రసా ద్‌నాయుడు, పాడి వెంకటసుబ్బయ్య, దువ్వూరు శ్రీనివా సులురెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలో పాల్గొననున్న రా కదలిరా బహిరంగ సభకు ఓజిలి మండలం టిడిపి శ్రేణులు 40 వాహనాలలో తరలి వెళ్లారు. వారి వెంట జయచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, టిడిపి శ్రేణులు, అభిమానులు, మహిళలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

## జిఎన్‌టి రోడ్డును బాగు చేయండి

– ఆర్‌అండ్‌బి అధికారులకు వినతి



సూళ్లూరుపేట, జనవరి 19 ప్రభాతవార్త

స్థానిక హోలీక్రాస్ హైస్కూల్ నుంచి అయ్యప్పస్వామి గుడి వరకు జిఎన్‌టి రోడ్డు అస్తవ్యస్థంగా తయారుకావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. దీనిపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా తరపున తిరుపతి జిల్లా సోషల్ వెల్ఫేర్ సెక్రటరి రాకేష్ లాల్, ఆలిండియా హ్యూమన్ రైట్స్ సూళ్లూరుపేట డివిజన్ ప్రెసిడెంట్ పి.రాంబాబు, సెక్రటరి కె.మాధవ్‌ల ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి డిఇ, జేఇలకు వినతిపత్రం అందజేశారు. జిఎన్‌టి రోడ్డు దారుణంగా తయారైందని ఆర్‌అండ్‌బి అధికారులకు తెలియజేశారు. దీనిపై జేఇ స్పందిస్తూ జిఎన్‌డి రోడ్డు మరమ్మతుల అంచనాలను ప్రభుత్వానికి పంపించామని తెలియజేశారు. నిధుల గ్రాంట్ కోసం వేచి చూస్తున్నామని, నిధులు విడుదలైన వెంటనే జిఎన్‌టి రోడ్డు మరమ్మతులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## 39వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

గూడూరు, జనవరి 19, ప్రభాతవార్త



అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె 36వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి అధ్యక్షురాలు ఇంద్రావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ నాయకులు బివి రమణయ్య, సురేష్, గుర్రంరమణయ్య, అడపాల ప్రసాద్, సెక్టార్ లీడర్స్ మునికుమారి, లక్ష్మి, ప్రసన్న, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలి

యుటిఎఫ్ డిమాండ్

గూడూరు, జనవరి 19, ప్రభాతవార్త



ఉపాధ్యాయులకురావాల్సి నడిఏ, పిఆర్సి, నంపాదిత సెలవుల బకాయిలు పీఎఫ్, ఏపి జిఎల్ఐ బకాయిలు వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని మండల విద్య వనరుల కేంద్రం వద్ద ధర్నా చేసారు. ఈసమావేశంలో తిరుపతిజిల్లా కార్యదర్శి జి. సుధీర్ యుటి ఎఫ్ నాయకులు రవి, నాగేశ్వర రావు, మురళి సింగ్, గునాధం, జనార్ధన్, బాబ్జీ, మనోజ్, శివాజి, వరప్రసాద్, వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో మెక్సిడియా పోస్టర్ ఆవిష్కరణ

కోట, జనవరి 19, ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్‌విభాగం ఆధ్వర్యంలో మెక్సిడియా2024 పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 24న తమ కళాశాలలో ఈ సదస్సు జరగనున్నట్లు పేర్కొ న్నారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలం గాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ హెచ్‌ఓడి డా. సిహెచ్ విక్రమ్ కుమార్, కన్వీనర్ డా. పిఎస్ రవికుమార్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, విద్యార్థులు లోకేష్, చరణ్, భానుచంద్, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

## జమీన్ కొత్తపాలెంలో ఆరోగ్య సురక్ష

వాకాడు, జనవరి 19, ప్రభాతవార్త

మండల పరిధిలోనిజమీన్ కొత్తపాలెం లో శుక్రవారం ఎంపిడిఓ గోపీనాథ్ పర్యవేక్షణలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంనిర్వహించారు. పేద ప్రజలకు పరిపూ ర్ణమైన ఆరోగ్యం అందించాలని లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగనన్న ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనిగానూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రామకుప్పం, జనవరి 19 ప్రభాతవార్త :



మండలంలోని ఆనిగానూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ నేత్ర నాగిరెడ్డి, డా॥ పూజిత మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం ఉచిత శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ఈసందర్భంగా 386మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రణీత, శ్వేత, నోడల్ అధికారి హరినాథరెడ్డి, సిబ్బంది బాలు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రంగా ప్రధాన కూడళ్ళు : కమీషనర్

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:

నగర పరిధిలోని కూరగాయల మార్కెట్లు, ప్రధాన కూడళ్ళు, ప్రధాన ప్రాంతాల పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్‌లో శానిటేషన్ పనులను తనిఖీ చేసి దుకాణదారులతో మాట్లాడారు. కూరగాయ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడవేయరాదని, పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు.కమీషనర్‌తో పాటు శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరసింహ, సిఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా కుల గణన

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:



కుల గణన సర్వేను పక్కాగా పొరబాట్లకు తావు లేకుండా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కుల గణన జరుగుతున్న తీరును శుక్రవారం మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణపురం, వెంకటేశ్వరకాలనీ పరిధిలో పరిశీలించారు. వాలంటీర్ల యాప్‌లో కుల గణన సర్వేకు సంబంధించిన వివరాల నమోదు అంశంను ఆమె తనిఖీ చేసి ఇంటింటి సర్వే ఎలా చేస్తున్నారంటూ వాలంటీర్లు, వార్డు కార్యదర్శులను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం గోపి, వార్డు క్యాదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సుబ్బానాయుడు కండ్రిగలో జగనన్న ఆరోగ్య సురక్ష

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 19 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగలో శుక్రవారం ముఖ్యమంత్రి విన్నూత్నంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మండల పార్టీ అధ్యక్షుడు మాజీ శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన గ్రామీణులతో ముఖా ముఖిగా మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వనన్ని ఆర్థిక వెసులుబాట్లను ప్రజలకు అందిస్తున్నారన్నారు.నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని వివరించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా మీకు మేలు చేసినానని భావిస్తేనే ఓటు వేయాలని పిలుపు నిచ్చారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి సేవలు ఎంతో అవసరం అన్నారు.చెర్లోపల్లి సచివాలయ కన్వీనర్ మావిళ్ళపల్లి వెంకటేష్, గోవింద్‌రెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేష్, పసల కృష్ణయ్య గ్రామ వాలంటీర్లు,కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్వచ్ఛతీర్థలో భాగంగా దేవాలయాల్లో శుద్ధి కార్యక్రమం

తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త :



దేశ ప్రధాని మోడీ పిలుపుతో ఆలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని స్వచ్ఛతీర్థ కార్యక్రమంలో భాగంగా దేవాలయాల్లో శుద్ధి కార్యక్రమాన్ని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా. ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సూచనలతో రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ మరియు బిజెపి నేతలతో కలసి స్థానిక బంగారమ్మ గుడి పరిసరాలను శుభ్రం చేయడంతోపాటు ఉత్సవమూర్తులకు ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా సభ్యులు ఎస్వీరమణ, పట్టణ అధ్యక్షులు గరికపాటిరమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, పట్టణ ప్రధాన కారయదర్శి కోనేటి అయ్యప్ప, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి పెద్దపాలెం రవి ఆచారి, కన్నా వెంకటేశ్వర్లు, బిజెపి సీనియర్‌నేతలు జివి.అమర్నాథ్, పగడాల ప్రతాప్, ఇ.మోహన్, యువమోర్చా నేతలు కొండ్ల భరత్‌నాయుడు, సజ్జహరీష్, కటికం చంద్ర, తిరువీధుల రాజానరసింహన్, శివనాథపాలెం కుమార్, కోలా.మురళీకుమార్‌సింహ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త :



పూడి సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూడి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగాప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్సకు అవసరమైన మందులను పంపిణీచేశారు.అలాగే కంటి వెలుగు కార్యక్రమంలో వృద్దులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి కంటి అద్దాలు రాసిచ్చారు. గర్భిణీస్త్రీలకు ప్రత్యేకంగా పరీక్షలు జరిపి వారికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సి.శివకుమార్, డాక్టర్ మాధవుడు, స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ హరిత,కాసారంవైద్య సిబ్బంది, సూపర్‌వైజర్స్, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## తెదేపా సమావేశానికి తరలిన మండల ప్రజలు

ఏర్పేడు,జనవరి19ప్రభాతవార్త :



వెంకటగిరి పట్టణంలో శుక్రవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నర్వహించిన రా కదలిరార! సమావేశానికి మండలంలోని40పంచాయతీల తెదేపా అభిమానులు తండోప తండాలుగా తరలి వెళ్ళారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని తెదేపా నాయకులు, కార్యకర్తలు సమావేశ బలోపేతానికి వివిద వాహనాల్లో తరలించారు. ఈసందర్భంగా మండల తేదేపా అధ్యక్షులు నైనారు పొన్నారావు, శివాజిరెడ్డి, కందాటి మహేష్,నాగేశ్వర్ రావు, నాగిరెడ్డి, మనోహర్‌రెడ్డి, హంస, ముని రామిరెడ్డి తదితర తెదేపా కర్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థికి మిద్దెలహరి సత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 19 ప్రభాతవార్త :



పట్టణంలోని శాంతి, భాస్కర్ దంపతుల కుమారుడు వేగూరు పవన్‌కుమార్ భాష్యం పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. చెన్నైలో అబాకస్ సంస్థ నిర్వహించే అంతరాష్ట్ర పోటీల్లో ఛాంపియన్‌గా ప్రథమబహుమతి అందుకోవడం అభినందనీయం అని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, మాజీ ఆప్కో డైరెక్టర్, స్కిమ్స్ విద్యాసంస్థల అధినేత మిద్దెలహరి కొనియాడారు. భవిష్యత్తులో పోటీతత్వంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.

### తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహా కవి యోగి వేమన

జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 19, ప్రభాతవార్త



తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహా కవి యోగి వేమన అని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యోగి వేమన జయంతి సందర్భంగా సమావేశ మందిరం నందు యోగి వేమన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డిఆర్‌ఓ పెంచల్ కిషోర్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలను తెలియజేశారని తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప కవి అని అన్నారు. వేమన పద్యాలు ఆధునిక పరిశోధనలను ఆధారం అయ్యాయని, సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తేలికైన పదజాలంతో వేమన పద్యాలతో తన భావాన్ని ప్రజలకు తెలియజేసారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వేమన పద్యాల యొక్క గొప్పతనాన్ని, జీవిత స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శంగా నిలవాలని తెలిపారు.జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రా కదలిరా సభలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

తిరుపతి టౌన్, జనవరి 19 ప్రభాతవార్త :

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన రా కదలిరా కార్యక్రమానికి జనసేన పార్టీ ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ హాజరైయ్యారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన టిడిపి అధినేత చంద్రబాబుకు పుష్పగుచ్చమిచ్చారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే జనసేన టిడిపి ఉమ్మడి ప్రభుత్వం రావాలని ఆయన ఆకాంక్షించారు.

## బుట్టలు అల్లే వారి జీవితాల్లో వెలుగులు రావాలి

వరదయ్యపాలెం, జనవరి 19 ప్రభాతవార్త :



అడవికి వెళ్ళి, ఈదులు తెచ్చి, నిలువునా చీల్చి, ఎండకు ఆరబెట్టి, ఓపికతో అల్లి, మార్కెటుకు తీసుకెళ్లి, అమ్మితే వచ్చే డబ్బులతో జీవనాన్ని సాగించే చేతి వృత్తి మీద ఆధారపడి జీవించే బుట్టలు అల్లేవారికి ఉపాధి లేకుండా పోతుంది. వారు అల్లిన తట్టలకు, బుట్టలకు ఆదరణ తగ్గిపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా సతమతమవు తున్నాయి. బుట్టలు, చాటలు అల్లికలకు ఆదరణ తగ్గుతుంది. వృత్తిని నమ్ముకుని దుర్భర స్థితిలో కుటుంబాలు వెళ్లదీస్తున్న పరిస్థితి దయనీయంగా మారింది. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం, ఇందిరానగర్ కాలనీలో కొన్ని కుటుంబాలు ఇప్పటికి ఈ అల్లిక వృత్తిని కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ద్వారా నగదు బదిలీలు చేస్తున్నప్పటికి, ముడి సరుకులు అందే పరిస్థితి కరువైంది. గతంలో అడవికి వెళ్లి ఈత ఆకుల నరుక్కుని వచ్చి, వాటిని ఈదులుగా మార్చి అల్లి వస్తువులుగా మార్చేవారు. నేడు లేపాక్షి లాంటి హస్తకలలు ఆదరణ కల్పించే సంస్థలు ఉన్నప్పటికి, చేతి వృత్తులు వారికి ఇకనైనా ముడిసరకులు అందించేందుకు అడవికి వెళ్లి, ఈదులు తెచ్చుకునే అవకాశం ఇవ్వాలి. ప్రభుత్వం ద్వారా ఈత చెట్ల సాగుకు ప్రత్యేక చొరవ చూపాలి. వీరికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నాణ్యమైన విద్యాబోధన...మెరుగైన సదుపాయాలు

టిటిడి కళాశాలలకు స్వయంప్రతిపత్తి హోదా

తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:



నాణ్యమైన విద్యాప్రమాణాలు, కళాశాలల అభివృద్ధి, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపు తదితర అంశాలపై అనుసరిస్తున్న విధానానికి యూజిసి టిటిడికి చెందిన పద్మావతి మహిళ డిగ్రీ,పిజి కళాశాల, ఎస్వీఆర్ట్స్ కళాశాల, ఎస్‌జిఎస్ ఆర్ట్సుకళాశాలలకు స్వయం ప్రతిపత్తి హోదా(అటానమస్) మంజూరైంది.దీనివల్ల 10సంవత్సరాల పాటు స్వయంప్రతిపత్తి హోదా మంజూరుచేయడం వల్ల విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచడం, కళాశాలలను మరింతగా అభివృద్ధిచేయడానికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలిగిందని జెఈఓ సదాభార్గవి తెలిపారు. ఇందుకుగాను టిటిడి సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి, టిటిడి విద్యాసంస్థల సలహాదారుడు మోహన్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్ళు డాక్టర్ టి.నారాయణమ్మ, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మహదేవమ్మ, కళాశాలల అధ్యాపక బృందాన్నిటిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## వెంకన్న అభిషేక సేవలో డాక్టర్ జవహర్‌రెడ్డి

తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:



రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి దంపతులు శుక్రవారం వేకువజామున వేంకటేశ్వరస్వామి అభిషేకసేవలో పాల్గొన్నారు.స్వామివారిని దర్శించుకున్న వీళ్ళు తీర్థప్రసాదాలు అందు కున్నారు. టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ పి.హరీంధ్రనాథ్ ,రిసెప్షన్ ఓఎస్‌డిరామ కృష్ణస్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:



కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామిని శుక్రవారం ఉదయం ప్రముఖులు దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, అనంతపురం రేంజి డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డి, తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి ఆలయంలోనికి చేరుకుని దేవదేవుడిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారియ తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఓటరుకార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలి : టిడిపి నేతల

తిరుపతి,జనవరి 19ప్రభాతవార్త:



రానున్న ఎన్నికలకు ఓటరుకార్డుకు అనుసంధానం చేసేప్రక్రియ చేయాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఓటరు జాబితా ముసాయిదా గందరగోళంగా తయారైందని, దొంగ ఓట్లుపై ఆందోళన వ్యక్తమవుతున్న సమయంలో ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం 80శాతం పూర్తయిందని అధికారులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దొంగ ఓట్లను తొలగించి ఆ తరువాత ఓటరు జాబితా 2024 ను ఆధార్‌కార్డు అనుసంధానం చేశాకే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం టిడిపి నేతలు ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, ఎంఎల్‌సి కంచర్లశ్రీకాంత్, మాజీ మంత్రి పనబాక లక్ష్మి, బొజ్జలసుధీర్, హెల్లెన్, శ్రీధర్‌వర్మ, పుష్పావతియాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, సింగంశెట్టి సుబ్బరామయ్య, కంకణాల రజినీకాంత్‌నాయుడు , రవినాయుడు, వట్టికుంట చిన్నబాబు, బ్యాంకు శాంతమ్మ, బుల్లెట్‌రమణ, ఆర్‌పి శ్రీనివాసులు, ఆనంద్‌గౌడ్, డాక్టర్ బాలసుబ్రమణ్యం తదితరులు ప్లకార్డులను చేతబట్టి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తిరుపతి ఎంపి ఉప ఎన్నికల్లో కమిషనర్ ఐడి లాగిన్‌చేసి బోగస్ ఓట్లు నమోదు చేసిన, ఎఫిక్‌కార్డులు మార్ఫింగ్ చేసి ఓటర్లనుచేర్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఈసిని కోరారు.

## అమ్మవారి సేవలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తిరుచానూరు, జనవరి 19 ప్రభాతవార్త :



తిరుచానూరు పద్మావతి అమ్మవారి సేవలో ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనను ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు రాష్ట్ర సిఎస్‌కు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, విజిఓ బాలిరెడ్డి, అర్చకులు బాబు స్వామి, ఏవిఎస్‌ఓ శైలేంద్రబాబు, విఐ రామమోహన్, ఇతర తితిదే అధికారులు పాల్గొన్నారు.

## సత్వరం ఆర్థిక బకాయిలు చెల్లింపు

– అంబేద్కర్ విగ్రహం ఎదుట యుటిఎఫ్ నిరసన

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:

ప్రభుత్వం పెండింగ్‌లో వుంచిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను సత్వరం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ రాష్ట్రలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు గత నాలుగున్నర సంవత్సరాలుగా అనేక బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ నిరసన ప్రదర్శనలో నాయకులు కె.శేఖర్, భానుప్రకాష్, సురేష్‌కుమార్, సర్దార్ చిరంజీవి, రాజేష్‌కుమార్, శ్రీరాములు, సోమశేఖర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమాంబపురంలో వికసిత్ యాత్ర

పాలసముద్రం, జనవరి 19 ప్రభాతవార్త:

భారత్ వికసిత్ యాత్ర శుక్రవారం ఆముదాల, గంగమాంబపురం పంచాయతీల్లో నిర్వహించారు. ఈ యాత్రకు జిల్లా బిజెపి కిసాన్ మోర్చా నాయకుడు చంద్రశేఖర్‌నాయుడు హాజరై మాట్లాడుతూ ప్రధాని మోడి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సగటు కుటుంబాలు ఆర్థికంగా లబ్ది పొందడానికి పలు పథకాలను చేపట్టి అమలు చేశారని ఈ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, జిల్లా వనరుల కేంద్రం ఎఓ పద్మజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ జ్ఞానశేఖర్, వ్యవసాయ శాఖ ఎఓ ఢిల్లీ ప్రసాద్, డిప్యూటీ తహసిల్దారు మధుబాబు, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ఎపిఓ మార్గరేట్, ఎపిఎం షరీఫ్‌మస్తాన్, ఇఓఆర్డీ రమేష్, సర్పంచ్‌లు అనురేఖ, నాగమ్మ, ఎంపిటిసీలు కుప్పమ్మ, లిఖిత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరుకు టిడ్కో ఇళ్ళు సిద్ధం : కమీషనర్

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:

నగర పాలక పరిధిలో పూణేపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ళ నిర్మాణాలను నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం పూణేపల్లి వద్ద టిడ్కో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గృహ సముదాయాల్లో జరుగుతున్న ఎలక్ట్రికల్, శానిటేషన్, రోడ్ల నిర్మాణం, మురికి నీటి కాలువల నిర్మాణ పనులను పరిశీలించి పెండింగ్ పనులను త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఇఇ వెంకటముని, సిఎంఎం గోపి, టిడ్కో కన్సల్టెంట్ ధనంజయరెడ్డి, గుత్తేదారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## విద్యతో పాటు క్రీడల్లో యువత రాణించాలి

మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త :



విద్యతో పాటు క్రీడల్లో కూడా యువత రాణించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. శుక్రవారం మరాఠీగేట్ సమీపంలో శాప్ నిధులు రూ. 78 లక్షల అంచనా వ్యయంతో స్కేటింగ్ రింగ్ నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆడుదాం...ఆంధ్రా వంటివినూత్న కార్యక్రమంచేపట్టారన్నారు. గ్రామీణ స్థాయి లోనిక్రీడాకారులప్రతిభనువెలికితీసేలక్ష్యంగాక్రీడా పోటీలునిర్వహిస్తున్నా మన్నారు. నగరి నియోజకవర్గంలో ప్రతి ఏడాది రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. ఇతర నియోజకవర్గాల్లో లేని విధంగా మండలకేంద్రాల్లో క్రీడాజిమ్‌లు,స్కేటింగ్‌రింగ్‌లు, క్రీడా కేంద్రాల ఆధునీకీకరణ, క్రీడా సామగ్రి సమకూర్చడం వంటి పనులు చేపడుతున్నామని తెలిపారు. స్కేటింగ్ రింగ్ నిర్మాణానికి భూసేకరణ నుంచి నిధులు రాబట్టే వరకూ వచ్చిన సమస్యలను అందరిసహకారంతో ఎదుర్కొని సాధించామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్‌లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, పలువురు అధికారులు, వైకాపాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం : జనసేన

విజయపురం, జనవరి 19 ప్రభాతవార్త :



వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్ అన్నారు. శుక్రవారంకళి యంబాకం ఆదిఆంధ్రవాడలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి టిడిపి మ్యానిఫెస్టో కనపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు వినోద్, శరవణ, సంయుక్త కార్యదర్శులు పరశురామ్, రవి పలువురు జన సైనికులు పాల్గొన్నారు.

## ఘనంగా రెడ్డివారి చక్రపాణిరెడ్డి జన్మదిన వేడుకలు

నింద్ర,జనవరి 19 ప్రభాతవార్త :

శ్రీశైలం ట్రస్టు బోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య ఘనంగా జరిగింది. రెడ్డివారి చక్రపాణిరెడ్డి జన్మదిన వేడుకలు పురస్క రించుకొని కొప్పేడు ఎంపిటిసి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి,చవరంబాకంలో సర్పంచ్ మనోహర్‌నాయుడు, ఇరుగువాయి జడ్పీటిసి సభ్యులు మల్లీశ్వరి పరంధా మయాదవ్,జియన్ కండ్రిగ గ్రామం సర్పంచ్ జయచంద్రారెడ్డి,కైపాకం సర్పంచ్ గోపినాయుడు,పాదిరి గ్రామ సర్పంచ్ సూర్య,ధశరధనాయుడు,నెట్టేరి గ్రామ సర్పంచ్ మురళీ నాయుడు, మేళంబాకం గ్రామసర్పంచ్ భాలక్రిష్ణమరాజు,నింద్ర గ్రామంలో చక్రపాణిరెడ్డి ఆర్మీ ఆధ్వర్యంలో విజయ,శ్రీరామాపురం, ఎలకాటూరు, కావనూరు, కచ్చరవేడు, ఒరూరుపేట, అత్తూరు,అగరం,గ్రామపంచాయితీలలో ఘనంగా జరుపుకున్నారు. శివయ్య,నాగభూషణంరాజు, గుణ, కార్తీక్,బాషా,సురేష్,సమ్‌సోన్ తదితరులు పాల్గొన్నారు.

## బోగస్ ఓట్ల సూత్రదారులను కఠినంగా శిక్షించాలి

బిఆర్‌ఎస్ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్



తిరుపతి టౌన్, జనవరి 19 ప్రభాతవార్త : బోగస్ ఓట్ల సూత్రదారులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బిఆర్‌ఎస్ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి అనంతవీధి కూడలిలోని బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తూవుంటే దొంగ దొంగ దొంగ అన్న చెందంగా తయారైందని, బాధ్యతతో మెలగవల్సిన ప్రభుత్వ అధికారులు బోగస్ ఓట్ల విషయంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం శోచనీయమన్నారు. బోగస్ ఓట్ల అసలు సూత్రధా రులను కనిపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## రాయితీపై పశుగ్రాసం విత్తనాలు

వడమాలపేట, జనవరి 19 ప్రభాతవార్త: :

పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ ద్వారా పశుగ్రాసం విత్తనాలైన మొక్కజొన్న, గడ్డి విత్తనాలు రాయితీపై అందజేస్తున్నట్లు పశు వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ విత్తనాలు 75 శాతం సబ్సిడీపై రైతులకు అందచేస్తామన్నారు. మొక్కజొన్న ఐదు కేజీలు 85 రూపాయలకు, గడ్డి గింజలు, జొన్న రకాలు ఐదు కేజీలు115రూపాయలకు రైతులుచెల్లించాల్సి ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్ నెంబరు ఇచ్చి మీ సమీపంలోని ఆర్‌బికే కాని, పశు వైద్యశాలల్లో పొందవచ్చునని ఆయన తెలిపారు.

## చెవిరెడ్డి హర్షిత్ పరామర్శ

చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త:

స్థానిక ఓ దినపత్రిక విలేకరి ఏనుగుల గోపాల్‌ను శుక్రవారం వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పరామర్శించారు. జనవరి 1న గోపాల్ తండ్రి ఏనుగుల సుబ్రమణ్యం మృతి చెందారు. ఈనేపధ్యంలో హర్షిత్ రెడ్డి దివంగత సుబ్రమణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు జయమ్మ, శ్యామల, హేమనిధి, జీవనప్రియ, రాగూరి చంద్రశేఖర్, చెంగల్రాయులు, జయశ్రీ, దాములను పరామర్శించి, విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, కొత్తపాటి హరి వున్నారు.

## సుప్రీమ్ కోర్టు ఉత్తర్వులను అమలు చేయండి..!

అంబేద్కర్‌కు అంగన్‌వాడీల వినతిపత్రం

చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త:



అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీమ్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.శివ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారానికై 39 రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం దీక్షా శిబిరం నుండి టవర్ క్లాక్ వద్దకు ర్యాలీగా చేరుకున్న అంగన్‌వాడీలు తమ కష్టాలు తీర్యాలనీ, సమస్యలను పరిష్కరించే బుద్దిని ప్రభుత్వానికి ప్రసాదించాలని కోరారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం : సర్పంచ్ భారతి

చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త:



జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు పేదలకు వరమని సర్పంచ్ భారతి అన్నారు. యం. కొంగరవారి పల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2 కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.శివాజీ ప్రయాగ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ సుజిత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతరం సర్పంచ్ వృద్దులకు కళ్ళజోడు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరాన్ని డాక్టర్‌ఆనంద్ బాబు పరిశీలించారు. సి.ఈశ్వరయ్య, ఎన్.లలిత, ఎస్.శ్యామల, వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి కాంగ్రెస్‌ను ఆదరించండి :చింతామోహన్

నారాయణవనం, జనవరి 19 ప్రభాతవార్త :



పేదల పక్షపాతపార్టీ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని మాజీకేంద్ర మంత్రి, తిరుపతి మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. మార్పు కావాలి-కాంగ్రెస్‌రావాలి అం శ కార్యక్రమంను శుక్రవారం సత్యవేడు నియోజకవర్గం లోని ఏడుమండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందు నారాయణ వనం మండలం భీమునిచెరువు, వెత్తలతడుకు గ్రామాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వున్న సమయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికి ఆయన నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. పిచ్చాటూరు. నాగలాపురం, కెవిబిపురం, సత్యవేడు, వరదయ్యపాలెం, బుచ్చినాయుడుకండ్రిగలో నిర్వహించారు. అనంతరం కరపత్రాలను అందించారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, జనవరి 19 ప్రభాతవార్త :

నారాయణవనం కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు.అనంతరం అమ్మవారినివివిధ రకాల పుష్పాలతో సుమనోహ రంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై ఊరేగించారు.

## జగనన్న సురక్షకు స్పందన

నారాయణవనం, జనవరి 19 ప్రభాతవార్త :

మండలంలోని భీమునిచెరువులో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష-2 వైద్య పరీక్షల కార్యక్రమానికి ప్రజలనుంచిస్పందన లభించింది. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వచ్చిన ప్రత్యేక డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలను అందించి, మందు, మాత్రలను అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి మురుగేశం,డాక్టర్‌దర్శిత్‌రాజ్, పంచాయితీ కార్యదర్శి కిషోర్‌కుమార్‌రాజు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

